సాక్షి
జనగామ

సోమవారం । 4 । నవంబర్ । 2024

ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న వందలాది మంది ప్రయాణికులు





సీటుకోసం చిన్నారిని బస్సు కిటికీలోంచి లోనికి పంపిస్తూ..

ప్రయాణం.. ప్రయాస

- దీపావళి పండుగ రిటర్న్‌లో ప్రయాణికుల గోస
- రద్దీకి తగ్గట్టుగా నడవని బస్సు సర్వీసులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

జనగామ: దీపావళి పండగ ముగిసింది.. వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లేందుకు ఇక్కట్లు తప్పడంలేదు. రద్దీకి తగ్గట్టుగా ఆర్టీసీ సంస్థ అదనపు బస్సు సర్వీసులు నడిపించకపోవడంతో ఒక్కో బస్సులో కెపాసిటీకి మించి నరక ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలు, వృద్ధులు బస్సు కోసం గంటల తరబడి నిరీక్షించడమే కాకుండా.. ఒంటి కాలుపై నిలబడాల్సిన పరిస్థితి ఉంది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం తర్వాత రెగ్యులర్ రద్దీతోపాటు పండగ సమయంలో ఊహించని విధంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది.

ప్రయాణికుల గోస

దీపావళి పండగ, కేదారీశ్వరి నోముల అనంతరం తిరుగుప్రయాణమైన ప్రయాణికులు చుక్కలు చూస్తున్నారు. బస్సు కోసం నిరీక్షణ అటుంచితే.. అందులోకి ఎక్కాలంటే సర్కస్ ఫీట్లు తప్పడంలేదని వాపోతున్నారు. సీటు దొరుకుతుందో లేదోనని పలువురు చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్నవారి కుటుంబ సభ్యులు ఫ్లాట్ ఫాం పైకి బస్సు రాక ముందే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెంబడించి బస్సు ఎక్కి సీటు దొరికించుకుంటున్నారు. కిటికీ నుంచి చిన్నారులను దూరించి.. సీటుపై కర్చీఫ్ వేసి.. సీటు సాధించడం కోసం ఓ యుద్ధమే చేయాల్సివస్తుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. జనగామ ఆర్టీసీ అధికారులు బస్సు ఫ్లాట్ ఫాం పైకి వచ్చే వరకు పోలీసు ప్రొటెక్షన్ ఉంచినా ఫలితం లేకుండా పోతుంది. జనగామ ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం వేలాది మంది ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించింది. కుటుంబ సమేతంగా తిరుగు ప్రయాణమైన వారంతా బస్సుల కోసం ఎదురు చూస్తూ... ప్రయాణ సమయంలో చెమటోడుస్తున్నారు.

న్యూస్‌రీల్

రైల్వేమంత్రిని కలిసిన చిన్నపెండ్యాల వాసి



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన పొలిటికల్ అడ్వయిజర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆకుల సాయికిరణ్ ఆదివారం ఒడిశాలోని బాలాసోర్‌లో కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో పలు సమస్యలపై ఆయన చర్చించారు. ఉదయం 10 గంటలకు రెండో ట్రిప్పు కోసం రద్దు చేసిన వరంగల్ నుంచి సికింద్రాబాద్ పుష్‌పుల్ రైలును పునరుద్ధరించాలని, వరంగల్‌లో ఐటీ కంపెనీలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. చిన్నపెండ్యాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

'కేసీఆర్ కుటుంబంపై ఉచ్చు ఎందుకు బిగుసుకోలేదు'



జనగామ: పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అక్రమాలు జరిగాయని పదేపదే ఆరోపణలు చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. కేసీఆర్ కుటుంబానికి ఎందుకు ఉచ్చు బిగుసుకోలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు వచ్చే అప్పులు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని, కల్వకుంట్ల కుటుంబం విచారణ ఎదుర్కోక తప్పదని ప్రగల్భాలు పలికిన కిషన్‌రెడ్డి, ఇప్పుడు ప్రజాపాలన చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారుపై ఆరోపణలు చేయడం చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు. డీపీఆర్ కూడా సిద్ధం కాని మూసీ బ్యూటిఫికేషన్‌లో రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కిషన్‌రెడ్డి బలహీనమైన నాయకుడిగా మరోసారి నిరూపించుకున్నాడన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, నాయకులు బానోత్ బస్సీ, బడికె ఇందిర, మిద్దెపాక సిద్దులు, కృష్ణస్వామి, మోటీ శ్రీనివాస్, దాసరి క్రాంతి, అర్షద్ రహమాన్, బత్తిని నిఖిల్, రెడ్డబోయిన మహేశ్ తదితరులు ఉన్నారు.

11 నుంచి ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎస్‌డీఎల్‌సీఈ (దూర విద్యా కేంద్రం) ఇయర్ వైజ్ స్కీం ఎమ్మెస్సీ మ్యాథ్స్ మొదటి సంవత్సరం ఎక్స్ అభ్యర్థులకు ఈనెల 11 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. ఈనెల 11, 13, 19, 21, 23 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 12 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 12, 14, 20, 22, 25 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు



హన్మకొండ: పెన్షనర్లు సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ అన్నారు. హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోషియేషన్ హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న సైబర్ క్రైమ్ బారిన పడుతున్న వారిలో 46 శాతం మంది వృద్ధులు, పెన్షనర్లు ఉన్నారన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా ఉండాల్సిన జాగ్రత్తలు వివరించారు. అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు వీరస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అసోషియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితా రెడ్డి, రిటైర్డ్ ఎస్సై సంజీవ రెడ్డి, పెన్షనర్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పురుషోత్తం, సమ్మారెడ్డి, ఖాజామొహినుద్దీన్, ఎ.సత్యనారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, రత్నాకర్, సుకుమార్‌రెడ్డి, ఎస్.కిష్టయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- 9,746 క్వింటాళ్ల కొనుగోళ్లు



మార్కెట్‌లో ధాన్యం రాశులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది. దీపావళి పండుగ నేపథ్యంలో మార్కెట్‌కు వరుస సెలవులు రావడంతో ఆదివారం ఒక్కరోజు రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనామ్ ద్వారా బిడ్డిం వేసి, రైతులకు ధర ప్రకటించారు. రెండు కవర్‌షెడ్లతోపాటు కళ్లాలు ధాన్యం రాసులతో నిండి పోయాయి. ప్రైవేట్ మార్కెట్‌లో ధర పడిపోకుండా ప్రత్యేక శ్రేణి కార్యదర్శి కొనుగోళ్లు పూర్తయ్యే వరకు ప్రత్యక్షంగా పరిశీలించారు. 246 మంది రైతుల వద్ద ఐఆర్64 రకం 9,746 క్వింటాళ్లు(14,994 బ్యాగులు), ఒక రైతు వద్ద ఆర్ఎన్ఆర్ రకానికి చెందిన 52 క్వింటాళ్ల సరుకును వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్టంగా క్వింటాకు రూ.1,853 మోడల్ ప్రైజ్ రూ.1,929, గరిష్టంగా రూ.2,031 ధర పలికింది. రైతు అంగీకారం మేరకు వ్యాపారులు సరుకులను కొనుగోలు చేయగా, ధర తక్కువగా అనిపిస్తే మరుసటి రోజు అమ్ముకోవచ్చని అధికారులు రైతులకు సూచించారు.

ఝాన్సీరెడ్డిని పరామర్శించిన సీఎం, పీసీసీ చీఫ్



ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని ఆదివారం హైదరాబాబాద్‌లో తన స్వగృహంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పరామర్శించారు. గత నెలలో జరిగిన ప్రమాదంలో కాలు విరిగి విశ్రాంతి పొందుతున్న ఝాన్సీరెడ్డిని పరామర్శించిన వారిలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఝాన్సీరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సత్కరించారు.

పల్లెల్లో 'లోకల్' లొల్లి..!

పంచాయతీ ఎన్నికలపై మళ్లీ మొదలైన సందడి

- ఓవైపు రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్
- మరో వైపు జనవరిలో ఎన్నికలని మంత్రుల ప్రకటన
- ఇప్పటికే సిద్ధమైన జీపీల వారీగా ఓటర్ల జాబితా
- తొమ్మిది నెలలుగా 1,705 పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన



సాక్షి ప్రతినిధి, వరంగల్ : పల్లెల్లో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మారిన రాజకీయ పరిణామాలు.. ఓవైపు రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్ కసరత్తు.. మరో వైపు అన్నీ కలిసొస్తే జనవరిలో ఎన్నికలని మంత్రుల ప్రకటన.. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం కాగా, రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. ఆ ప్రక్రియ కూడా వేగంగా జరుగుతున్న క్రమంలో సంక్రాంతి నాటికి సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఉండవచ్చన్న ప్రచారం రెండు రోజులుగా జోరందుకుంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు కలిసొస్తే పోటీ చేయాలన్న సంకల్పంతో ఉన్న ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

రిజర్వేషన్లపై త్వరలోనే నిర్ణయం..!

పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలన్న స్పష్టత వచ్చినా.. పాత రిజర్వేషన్లతో ముందుకు పోవడమా? కొత్త రిజర్వేషన్ల ఖరారు తర్వాతే నిర్వహిస్తారా? అనే అంశంపై ఇంకా సందిగ్ధత నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తొలుత భావించింది.. అయితే పాత రిజర్వేషన్ల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు నష్టపోతారని విపక్షాలు ఆరోపించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు పట్టుబట్టడంతో ప్రభుత్వం బీసీ కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ నెలాఖరు నాటికి బీసీ కులగణన.. బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ పూర్తి చేసి త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే జనవరిలో పంచాయతీ ఎన్నికలు తథ్యమన్న సంకేతాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మరింత దూకుడు పెంచాయి. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా కార్యక్రమాలను విస్తృతం చేశాయి.

అధికారులకు సర్కారు నుంచి సంకేతాలు..?

ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా సన్నద్ధం కావాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈ మేరకే ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన చీఫ్ సెక్రటరీ శాంతికుమారి కలెక్టర్లకు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లో అధికార యంత్రాంగం గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సర్వసన్నద్ధమవుతోంది. సంక్రాంతి నాటికి పల్లెల్లో కొత్తపాలనా వ్యవస్థ కొలువు తీరేలా చూడాలన్న ప్రభుత్వ సంకల్పం మేరకు ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరితో సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో పాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం స్పెషలాఫీసర్లను నియమించింది. అయితే తొమ్మిది నెలలుగా వారి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగుతుండగా.. అధికారులు, సిబ్బంది కొరత కారణంగా చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దీంతో ఎన్నికల నిర్వహణే సరైన మార్గమని భావిస్తున్న సర్కారు ఆ దిశగా దృష్టి సారించిందన్న ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సంఘం కూడా అధికారులను అప్రమత్తం చేస్తోంది.

ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా మండలాలు, జీపీలు, వార్డుల్లోని పురుషులు, స్త్రీలు, ఇతర ఓటర్ల సంఖ్య వివరాలు ఇలా..

జిల్లా	మండలాలు	జీపీలు	వార్డులు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
హనుమకొండ	12	210	1,986	1,78,824	1,87,006	02	3,65,832
వరంగల్	11	325	2,828	1,91,235	1,97,808	09	3,89,052
జనగామ	12	283	2,576	2,03,097	2,06,696	04	4,09,797
జేఎస్ భూపాలపల్లి	11	240	2,044	1,42,217	1,48,432	14	2,90,663
మహబూబాబాద్	16	473	4,056	2,71,927	2,80,240	25	5,52,192
ములుగు	09	174	1,556	1,15,501	1,22,332	25	2,37,858
మొత్తం	71	1,705	15,046	11,02,801	11,42,514	79	22,45,394

కడియం మోసగాళ్లకే మోసగాడు

- రేవంత్‌రెడ్డి పతనానికి కడియమే సూత్రధారి
- స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

జనగామ: బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలుపొంది పార్టీ మారినవారిలో కడియం శ్రీహరి మోసగాళ్లకే మోసగాడిగా చరిత్ర సృష్టించారని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి ప్రవేశించిన నాటినుంచి కడియం నమ్మకద్రోహి, జిత్తులమారి నక్కగా పేరు తెచ్చుకున్నాడని ఆరోపించారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కే కడియం కావురంఎక్కి, కళ్లు, ఒళ్లు తెలియకుండా కేటీఆర్ గురించి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌పై కడియం నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. రూ.100కోట్లకు అమ్ముడుపోయిన కడియం, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. 1995లో మంత్రిగా ఉన్న సమయంలో ఆయన చేసిన అవినీతి బాగోతంపై కల్నాయక్ అనే పుస్తకాన్ని ముద్రించారన్నారు. 1992లో రాజకీయాలకు వచ్చినప్పుడు కడియం శ్రీహరి గచ్చు నేలతో ఉన్న ఇంట్లో ఉండే వారన్నారు. ఇప్పుడు హనుమకొండలో రూ.10కోట్లతో భవంతి, కోట్లలో ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో.. ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పతనం కావడానికి కడియం శ్రీహరే సూత్రధారి అవుతాడని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌లో మొదటి స్థానంలో ఉన్న కడియం శ్రీహరి, నేడు రేవంత్‌రెడ్డిని కలిసే దిక్కులేదన్నారు. కడియంకు సిగ్గు ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, మళ్లీ పోటీ చేసి సత్తా నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో కొమురవెల్లి మాజీ చైర్మన్ సంపత్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీలో దీపావళి మూరత్ పూజలు

- నూతన కొనుగోళ్లు ప్రారంభం



మార్కెట్‌లో లక్ష్మీపూజ చేస్తున్న వ్యాపారులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం దీపావళి మూరత్(నూతన వ్యాపారం /లక్ష్మీ పూజ) పూజలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రధాన పూజారి, క్రిష్ణమాచారి సిద్ధాంతి మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పజ్జూరి జయహరి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, పాలక మండలి, వ్యాపారులు, ఖరీదు, అడ్తీదారులు, దడువాయి, హమాలీలు పాల్గొన్నారు. లక్ష్మీపూజలు ముగిసిన తర్వాత మూరత్ కొనుగోళ్లు ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరు నరసింహులు, డైరెక్టర్లు బొట్ల నర్సింగరావు, నీల మోహన్, నాగబండి రవీందర్, శ్రీనివాస్, భాష్మియా, బుట్‌రెడ్డి శ్రీలత, శ్రీనివాస్, కుమార్, కొండల్‌రెడ్డి, రైస్, పత్తి మిల్లర్లు, వ్యాపారులు అశోక్, వెంకన్న, శ్రీనివాస్, సంతోశ్, తదితరులు ఉన్నారు.

సోమేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలు



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



వెండి ఛత్రం, చామరాంను అర్చకులకు అందజేస్తున్న దాతలు

- దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్న మహిళలు
- దేవాదాయశాఖ నుంచి మహిళలకు వాయినం అందజేసిన అర్చకులు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కమిషనర్ దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాలతో దీపోత్సవంలో పాల్గొన్న మహిళలకు ఆలయంలో నుంచి ప్రమిదలు, నూనె, ఒత్తులు, పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్క, పండ్లు తాంబూలం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

వెండి 'ఛత్రం, చామరాం' సమర్పణ

శ్రీసోమేశ్వర స్వామివారికి 933 గ్రాముల మిశ్రమ వెండితో తయారు చేసిన 'ఛత్రం' 'చామరాం' భక్తుడు ఆదివారం ఆలయానికి సమర్పించినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. శ్రీసోమేశ్వర స్వామివారికి ప్రతి నెలా నిర్వహించే ఆరుద్రోత్సవ కార్యక్రమంలో ఉపయోగించడానికి ఆలయ ముఖ్య అర్చకుడు దేవగిరి అనిల్‌శర్మ సూచనతో వరంగల్‌కు చెందిన కాసం శివకుమార్, పద్మ, మహేశ్, మౌనిక కుటుంబ సభ్యులు స్వామివారికి రూ.1,00,000 విలువైన మిశ్రమ వెండి ఛత్రం (గొడుగు), చామరాం(విసనకర్ర) ఆలయానికి సమర్పించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి అనిల్‌శర్మ, నాగరాజు, సిబ్బంది సరోజిని, నవీన్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడిని దర్శించుకున్న జడ్జిలు

కార్తీక మాసంలో భాగంగా ఆదివారం శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని కరీంనగర్ జిల్లా కోర్టు జడ్జి ప్రీతి, నాగర్‌కర్నూలు జడ్జి శ్రీనిధి దర్శించుకొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతరొస్తోంది.. రోడ్లు బాగుచేయండి

- 14వ తేదీ నుంచి జీడికల్ జాతర
- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక
- అధ్వాన రోడ్లతో తప్పని తిప్పలు



గుంతలమయమైన రహదారి



రామచంద్రస్వామి దేవస్థానం

లింగాలఘణపురం: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి జాతర 14వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. అయితే జీడికల్‌కు వచ్చే మూడు దిక్కుల రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. జనగామ నుంచి కళ్లెం మీదుగా వచ్చే రోడ్డు మరింత అధ్వానంగా మారింది. అలాగే.. లింగాలఘణపురం మీదుగా వెళ్లే రోడ్డు బండ్లగూడెం, గుమ్మడవెల్లి గ్రామాల్లో గుంతలమయమైంది. ఇక ఆలేరు నుంచి వచ్చే రోడ్డు, ఇటు మోత్కూరు నుంచి వచ్చే రోడ్డుకు సంబంధించి జీడికల్ పరిధిలో మూడు కిలోమీటర్లు డబుల్ రోడ్డు వేయకుండా వదిలేశారు. దారి పొడవునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనికి ప్రధాన కారణం ఈ మూడు కిలోమీటర్లు వేర్వేరు జిల్లాలు(యాదాద్రి, జనగామ), వేర్వేరు నియోజకవర్గాలు (స్టేషన్ ఘన్‌పూర్, ఆలేరు) పరిధిలో ఉండడమే.

మంజూరైన నిధులు వెనక్కి..

కళ్లెం–జీడికల్ వెళ్లే రోడ్డు మరమ్మతుకు మూడేళ్ల క్రితం రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డుపై గుంతలు అధికంగా ఉండడంతో నిధులు సరిపోవనే సాకుతో టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. కొత్తగా ఇటీవలే రూ.18 కోట్లతో 13.700 కిలోమీటర్ల రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు. వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

ఆటో డ్రైవర్ల అవస్థలు

నిత్యం జీడికల్, సిరిపురం, కళ్లెం గ్రామాల నుంచి ప్రయాణికులను తీసుకెళ్లే ఆటోల డ్రైవర్ల ఇబ్బందులు వర్ణనాతీతం. తరచుగా ప్రమాదాలు జరగడం, ఆటోలు ధ్వంసమై మరమ్మతులకు గురి కావడంతో తప్పని పరిస్థితుల్లో రోడ్డుపై ఏర్పడిన గుంతలను అనేకసార్లు స్వయంగా మట్టితో నింపి తాత్కాలికంగా మరమ్మతు చేయించుకున్నారు. వర్షాలకు ఆ మట్టి కొట్టుకుపోవడం, మళ్లీ మట్టిపోసుకోవడం జరుగుతుందే తప్ప శాశ్వతంగా రోడ్డు పనులు మాత్రం చేపట్టడంలేదు.

నిత్యం నరకయాతనే..



ఆటో నడిపితేనే జీవనం సాగేది. గుంతలమయమైన రోడ్డుతో ఆటో తరచూ మరమ్మతుకు వస్తోంది. రిపేరు చేయించలేక ఇబ్బంది పడుతున్నం. డీజిల్ కూడా ఎక్కువగానే ఖర్చవుతోంది. త్వరగా రోడ్డు మరమ్మతు చేయించి ఈ నరకయాతన నుంచి బయటపడేయాలి.

\- బెజ్జరబోయిన శ్రీనివాస్, ఆటో డ్రైవర్, జీడికల్

మట్టితో నింపుకున్నాం..



రోడ్డుపై ఏర్పడిన గుంతల విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోలేదు. అనేకసార్లు సొంత ఖర్చులతో మట్టితో తాత్కాలిక మరమ్మతు చేసుకున్నాం. కొద్ది రోజులు కాగానే మట్టి మొత్తం కొట్టుకుపోయి మళ్లీ గుంతలు పడుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి రోడ్డు బాగు చేయాలి.

\- రాంబాబు, ఆటో డ్రైవర్, కళ్లెం

రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం

కళ్లెం–జీడికల్ రోడ్డు పనుల కోసం రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. గతంలో రూ.3 కోట్ల నిధులు మరమ్మతులకు సరిపోవని టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రద్దయ్యాయి. నిధులు మంజూరు కాగానే రోడ్డు పనులు చేపడతాం.

\- శ్రీనివాస్, పీఆర్ ఏఈ

క్లుప్తంగా

సీఐఎస్ఎఫ్ డీఐజీ పూజలు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని హైదరాబాద్ సీఐఎస్ఎఫ్ డీఐజీ అపరాజిత మొహపాత్ర దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆమె ఆదివారం ముక్తీశ్వరుడి సన్నిధికి రాగా, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో అభిషేక అర్చనలు చేశారు. శ్రీశుభానందాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆశీర్వచన వేదిక వద్ద ఆమెకు అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, వైకుంఠ పాండాలు.. తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు.

సమ్మయ్యకు జీవన సాఫల్య పురస్కారం



దేవరుప్పుల : గల్లీ నుంచి ఢిల్లీకి యక్షగాన కళను విస్తరింపజేసి జాతీయ స్థాయిలో పద్మశ్రీ అవార్డు అందుకున్న గడ్డం సమ్మయ్యను అమ్మయాది పెండెం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారం వరించింది. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం బ్రహ్మణపల్లిలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ప్రముఖ రచయిత సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పెండెం సత్యనారాయణ, జిరసం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగన్న, అమ్మయాది ప్రధాన కార్యదర్శి పెండెం లక్ష్మి తదితరులు ఉన్నారు.

గ్యాస్ పైపు పగిలి టిఫిన్ సెంటర్ దగ్ధం



మహబూబాబాద్ రూరల్ : గ్యాస్ పైపు పగిలి టిఫిన్ సెంటర్ దగ్ధమైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బైపాస్ వద్ద గాజుల ప్రవీణ్ అనే వ్యక్తి సంచార వాహనం ద్వారా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే ఆదివారం కూడా టిఫిన్ సెంటర్ తెరచి ఉంచగా అందులో పనిచేసే సిబ్బంది వినియోగదారులకు దోసెలు వేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ పైపు పగిలి మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు మంటలను చల్లార్చే ప్రయత్నం చేసి అగ్నిమాపక వాహనానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను పూర్తి స్థాయిలో అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో టిఫిన్ సెంటర్ వాహనంలోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతై రూ.1.50 లక్షల నష్టం సంభవించిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు.



ST.PETER'S INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
VIDYANAGAR, HANUMAKONDA, TELANGANA- 506001.
Email: spipswgl@gmail.com, Website: www.stpeters.co.in, Cell: 9000001196

NOTIFICATION FOR ADMISSIONS UNDER "CATEGORY-B" 2024-25

Applications are invited from eligible candidates for the following courses under "Category-B" for the academic year 2024-25.

Course	Total Intake	Category-"B"
1) B.Pharmacy	100	30
2) Pharm-D	30	09

Applications can be obtained from the college or downloaded from the college website. Filled in applications should be submitted on or before 11-11-2024. Eligibility & Admission procedure is as per the guidelines issued by Govt. of Telangana and Kakatiya University from time to time.

Secretary & Correspondent

వరి, పత్తి పంటలు విక్రయిస్తున్నారా.. ఈ నిబంధనలు పాటించండి

- నాణ్యతా ప్రమాణాలతోనే అధిక ధర
- ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించాలి
- రైతులకు ఏఈఓ రఘు పలు సలహాలు



రఘు,వ్యవసాయ విస్తరణ అధికారి

చెన్నారావుపేట: అన్నదాతలు.. పత్తి, వరి పంటను విక్రయిస్తున్నారా? అయితే ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. అప్పుడే అధిక ధరలు లభిస్తాయి. లేనిపక్షంలో పంట అమ్ముడుపోని పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు తమ పంట సరుకులను మార్కెట్‌కు తీసుకెళ్లే క్రమంలో తప్పనిసరిగా పాటించాల్సిన సలహాలు, సూచనలను వ్యవసాయ విస్తరణ అధికారి రఘు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మార్కెట్‌కు ఎలా వెళ్లాలి..

నాణ్యమైన పత్తికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7520 లభిస్తుంది. పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లక ముందే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని సంప్రదించి పంట నమోదు వివరాలు (కొలు, తదితర వివరాలు సరిచూసుకోని) తెలుసుకోవాలి.

ధాన్యం..

వరి బాగా ఎండిన తర్వాతే పంటను హార్వెస్టర్లతో కోయాలి. కోత సమయంలో హార్వెస్టర్ ఫ్యాన్ బ్లోయర్ స్పీడ్ 18 ఆర్‌పీఎం నుంచి 20 ఆర్‌పీఎం ఉండేలా చూసుకోవాలి. తాలు ధాన్యం రాకుండా జాగ్రత్త పడాలి

సెంటర్ తీసుకురాకముందే..

ధాన్యాన్ని సెంటర్‌కు తీసుకురాకముందే నాణ్యతా ప్రమాణాల అనుసరించాలి. మట్టి పెళ్లలు, రాళ్లు 1 శాతం తక్కువ, చెత్త, ఇతర ధాన్యపు గింజలు 1 శాతం కన్న తక్కువ, రంగు మారిన, మొలకెత్తిన పురుగు తిన్న ధాన్యం 5 శాతం కన్న తక్కువ, పరిపక్వం కాని ముడుచుకున్న ధాన్యం 3 శాతం కన్న తక్కువ, తక్కువ రకముల మిశ్రమం 6 శాతం కన్న తక్కువ, తేమ శాతం 17 శాతం కన్న తక్కువ ఉండేలా చూసుకుని, శుభ్రం చేసిన ధాన్యాన్ని సాధారణ, గ్రేడ్ 'ఏ' ధాన్యాన్ని వేర్వేరుగా తీసుకురావాలి.

సన్నధాన్యానికి బోనస్ రూ. 500

సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని సాధారణ, గ్రేడ్ 'ఏ'గా కలిపి తీసుకొస్తే సాధారణ గ్రేడ్ ధర నిర్ణయిస్తారు. అప్పుడు రైతుకు నష్టం జరుగుతుంది. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు సాధారణ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2300, 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2320 ప్రభుత్వ విధి విధానాలను అనుసరించి సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్ ధర అనగా రూ. 2820 రైతులకు చెల్లిస్తారు.

- కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యంలో ఏమైనా నాణ్యతను తగ్గించే అంశాలు (చెత్త, తాలు, ఇతరత్రా) ఉంటే వాటిని కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన తూర్పార ఫ్యాన్లు, తూర్పార యంత్రం, ధాన్యం క్లీనింగ్ మిషన్ల ద్వారా శుభ్రం చేసుకోవాలి.
- సన్న, దొడ్డు రకం ధాన్యం వేర్వేరుగా సెంటర్లకు తీసుకొచ్చి ఇక్కడ ఏర్పాటు చేసిన వేర్వేరు కంపార్ట్‌మెంట్లలో వేర్వేరు రాశులుగా పోసుకోవాలి.
- పత్తి, ధాన్యం విక్రయించే సమయంలో రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కు ఫోన్ నంబర్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలి. లేని పక్షంలో ఓటీపీ రాక ఖాతా డబ్బులు చెల్లించే క్రమంలో తీవ్ర ఇబ్బందులు, జాప్యం జరుగుతుంది. నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వానికి రైతులు సహకరించాలి.



కొనుగోలు కేంద్రం (ఫైల్)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఏరిన పత్తిని ఎండబెట్టి తేమ 8 నుంచి 12 శాతం ఉండేలా చూసుకోవాలి. చెత్త లేకుండా శుభ్రం చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ యూరియా/ డీఏపీ, ఇతర ఎరువులు, ఇతర ప్లాస్టిక్ సంచుల్లో పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లొద్దు. పత్తిని లూజుగా మాత్రమే వాహనాల్లో తీసుకెళ్లాలి. లేని పక్షంలో తప్పనిసరి పరిస్థితుల్లో పాత చీరలు, నూలుతో తయారు చేసిన దుప్పట్లలో కట్టి తీసుకెళ్లాలి. లేకపోతే ప్లాస్టిక్ సంచులకు సంబంధించిన చిన్న ముక్కలు పత్తిలో కలిసిపోయి, నాణ్యత తగ్గి రైతులకు ధర తగ్గే అవకాశం ఉంటుంది.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి పోటీలు



బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న బాలుర జట్లు

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్, వూషూ పోటీలు ఆదివారం రాత్రి వరకు కొనసాగాయి. ఉమ్మడి 10 జిల్లాల నుంచి బాస్కెట్ బాల్ పోటీల్లో 20 టీమ్‌లు (బాల, బాలికల అండర్ 17), వూషూ పోటీల్లో (బాల, బాలికలు అండర్ 17, 19 విభాగం) 40 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ మేరకు బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో కరీంనగర్‌పై(06), ఖమ్మం జట్టు (14 పాయింట్లతో) విజయం సాధించింది. అదే విధంగా నల్లగొండపై(08), మెదక్ (18), నల్లగొండపై (15) హైదరాబాద్(18), మహబూబ్‌నగర్(00)పై రంగారెడ్డి (29), ఆదిలాబాద్‌పై(01), నిజామాబాద్ (23), వరంగల్‌పై(05), రంగారెడ్డి జట్టు (27) విజయం సాధించింది. అదే విధంగా బాలుర బాస్కెట్ బాల్ పోటీల్లో ఆదిలాబాద్ జట్టుపై(07), హైదరాబాద్ జట్టు (48)పాయింట్లతో గెలిపొందింది. అదే విధంగా కరీంనగర్‌పై(08) నల్లగొండ (29), మెదక్‌పై(04)రంగారెడ్డి (44), వరంగల్‌పై (10) హైదరాబాద్ (27), మహబూబ్‌నగర్‌పై(02) కరీంనగర్(09), నిజామాబాద్‌పై(07) రంగారెడ్డి (22), ఖమ్మంపై(22) నల్లగొండ జట్టు(30) పాయింట్లతో గెలుపొందింది. కాగా లీగ్ మ్యాచ్‌లు పూర్తయి, క్వార్టర్ ఫైనల్స్ పోటీలు రాత్రి జరిగాయి. అదే విధంగా సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వూషూ(బాల,బాలకలు అండర్ 17, 19) రాష్ట్ర స్థాయి పోటీలను సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ మేరకు రాత్రి వరకు నిర్వహించిన వూషూ పోటీల్లో విజయం సాధించిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో బహుమతులు అందజేశారు.

కుమారుడి జ్ఞాపకాలు పదిలంగా..

- విగ్రహం ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు



సిద్ధార్థ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న తల్లిదండ్రులు

దంతాలపల్లి : చనిపోయిన కుమారుడి జ్ఞాపకాలు తాము బతికున్నంత కాలం పదిలంగా చూసుకోవాలని ఆ తల్లిదండ్రులు తలిచి కొడుకు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం గున్నెపల్లి గ్రామానికి చెందిన చిల్ల అరుణ-లక్ష్మీనర్సు దంపతులకు సిద్ధార్థ్, గోవర్ధన్ కుమారులు. వ్యవసాయ కుటుంబం కావడంతో కన్నవారి కష్టం చూసిన పెద్ద కుమారుడు సిద్ధార్థ్(21) హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు, వాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గతేడాది దీపావళి పండుగ పూట స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డుపై ఆగిఉన్న ఓ వాహనాన్ని ఢీకొని మృతిచెందాడు. చేతికి అందవచ్చిన కుమారుడు కానరాకుండా పోవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కుమారుడిపై ఉన్న ప్రేమను మరవలేక మదనపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం కొడుకు సంవత్సరీకం సందర్భంగా వ్యవసాయ భూమిలో ఆలయం నిర్మించి అక్కడ సిద్ధార్థ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 'మేము రోజూ చేను దగ్గరే పనులు చేసుకుంటూ ఉంటాము.. విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల కొడుకు మా తోనే ఉన్నట్లు ఉంటుంది' అని ఆ తల్లిదండ్రులు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



టీఎస్ఈఈయూ-327 తొర్రూరు డివిజన్ నూతన కమిటీ

హన్మకొండ/తొర్రూరు రూరల్ : విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారం, హక్కుల సాధనలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327 ఒక్కటే కృషి చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో టీఎస్ఈఈయూ-327 తొర్రూరు డివిజన్ సర్వసభ్య సమావేశం జరిగింది. యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి శ్రీమతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇనుగాల శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావం నుంచి అనేక సమస్యలు పరిష్కరించుకున్నామని, హక్కులు సాధించుకున్నామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం యూనియన్ తొర్రూరు డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.భోజ, కార్యదర్శిగా సికిందర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.నాగరాజు, కోశాధికారిగా రవికుమార్, అడిషనల్ సెక్రటరీగా ఎం.మునిప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.సైదులు, ఎస్.ప్రవీణ్, జాయింట్ సెక్రటరీలుగా ఎం.సతీశ్, ఎ.సుమన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు.

ఎస్సీ వర్గీకరణపై కుట్రలను తిప్పికొట్టాలి

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మాలలు

గూడూరు: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ, మంద కృష్ణ మాదిగ కుట్రలను తిప్పికొట్టాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన మాలల మహాపాదయాత్ర ఆదివారం పదోరోజు గూడూరుకు చేరుకుంది. పాదయాత్రకు మండల మాల మహానాడు నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్థానిక ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో సుధాకర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికే ఏ రాష్ట్ర, కేంద్ర పార్టీలకు మాలలు ఓటేయొద్దన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఎప్పుడో ఎస్సీ వర్గీకరణలో తక్కువ కులాలను కలిపి చేస్తే, నేడు ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలతో కొన్ని పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు. మాలలు, మాదిగలు కలిసి ఉండాలని మాల మహానాడు నిర్ణయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై జడ్జితో చెప్పిస్తే ఊరుకునేది లేదన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న బహిరంగ సభకు మాలలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అశోకభాస్కర్, వెంకటస్వామి, చిట్టిమల్ల సమ్మయ్య, దాసరి అనిల్, బెజ్జం రమేశ్, చీదురు వెంకన్న, చీదురు హరీశ్, దోమ ఉపేందర్, నాగెల్లి వెంకన్న, దోమ సారయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ దివాకర టీఎస్

ములుగు: అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 16 సంవత్సరాల తర్వాత పాఠశాల, వసతి గృహాల్లో ఉండే విద్యార్థినులకు కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు. డైట్ చార్జీలు ఏడు సంవత్సరాల తరువాత 40 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రతీ కుటుంబం నుంచి విద్యావేత్తలు అయితే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. ఎంపీ బలరాం నాయక్, తాను హాస్టళ్లలో ఉండి చదువుకున్నామని గుర్తు చేశారు. పెరిగిన డైట్ చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉండే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కాగా, వసతి గృహాల్లో వేడినీరు సౌకర్యం లేదని మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో సోలార్ వాటర్ సిస్టం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, ఎంపీ, కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్, ప్రిన్సిపల్ నర్మద, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడిగా వచ్చి వస్తువుల చోరీ

- సీసీ కెమెరాల ఆధారంగా గుర్తింపు
- పోలీసులకు యువకుడి అప్పగింత

మహబూబాబాద్ రూరల్ : వినియోగదారుడిగా వచ్చి డబ్బులు చెల్లించకుండా వస్తువులను చోరీ చేస్తున్న ఓ యువకుడిని గుర్తించిన మార్ట్ నిర్వాహకులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రిలయన్స్ మార్ట్ మేనేజర్ బొడ్డు మహేందర్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హరికిషన్ ఆయిల్ మిల్ ఎదుట రిలయన్స్ మార్ట్ కొనసాగుతోంది. పది రోజులుగా ఓ యువకుడు ఈ మార్ట్‌కు వినియోగదారుడిగా వచ్చి బ్యాగులో సరుకులు తీసుకుని సిబ్బంది కళ్లుగప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నాడు. ఈ క్రమంలో ఆ యువకుడి కదలికలపై అనుమానం వచ్చి మార్ట్‌లోని సీసీ కెమెరాలో నిక్షిప్తమైన చోరీ దృశ్యాలను శనివారం పరిశీలించారు. రోజూ వినియోగదారుడిగా వచ్చి డబ్బులు చెల్లించకుండా వస్తువులు చోరీ చేసి పట్టుకెళ్తున్న యువకుడు అతడే అని గుర్తించారు. ఆదివారం మార్ట్‌లోకి సదరు వ్యక్తి వచ్చి బ్యాగులో సరుకులు తీసుకోవడాన్ని గమనించారు. రోజుమాదిరిగానే వెళ్లిపోతుండగా పట్టుకున్నారు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి మార్ట్ నిర్వాహకులు ఆ యువకుడిని పోలీసులకు అప్పగించారు.

ఎస్‌జీటీలపై పనిభారం తగ్గించాలి

- డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి



మాట్లాడుతున్న పర్వతరెడ్డి

విద్యారణ్యపురి: అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)పై పనిభారం పెరిగిపోతుందని, దీనిని తగ్గించాలని రాష్ట్రోపాధ్యాయ సంస్థ (ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ఎస్‌టీయూ భవనంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో పనివేళలు గంట భోజన విరామం సమయం కలుపుకుని ఏడు గంటల పనివేళలు మాత్రమే ఉండాలని విద్యాశాఖ చట్టం సూచిస్తోందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షకులైన జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఉన్నతపాఠశాలల టైంటేబుల్స్‌ను పాటించాలని ప్రాథమిక పాఠశాలల పనివేళలను పెంచుతూ ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలల పనివేళలపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విద్యాశాఖ డైరెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సదానంద గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎస్‌టీయూ శాఖ స్వాగతిస్తోందన్నారు. అయితే సర్వే విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని, దివ్యాంగులు, చంటి పిల్లలు కలిగిన తల్లులను మినహాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎ. సదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భీమనాథుని రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. సాంబయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర రమేశ్, రాష్ట్ర కార్యదర్శి రూపిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎస్‌టీయూ హనుమకొండ,వరంగల్, ములుగు జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాచమల్ల తిరుపతి, మేడిపల్లి విద్యాసాగర్, కామగోని రాంబాబు, మూల మధు మిలిమాయే, దానం నాగరాజు, ఎ. మధుసూదన్, ఎస్.సతీశ్‌కుమార్, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


కాల్వలో పడి వృద్ధురాలి మృతి



చంద్రమ్మ(ఫైల్)

సంగెం: కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గుంటూరుపల్లికి చెందిన పాతూరి చంద్రమ్మ(95)కు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లు జరిగాయి. ఈ క్రమంలో చంద్రమ్మ ఆదివారం ఇంట్లో గొడవ పడి తన కూతురు గ్రామం శ్రీనగర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో తీగరాజుపల్లి వద్ద దిగింది. ఎస్సారెస్పీ కాల్వలో పడి మృతి చెందింది. కెనాల్‌లో చంద్రమ్మ మృతదేహం ఉందనే సమాచారం మేరకు కుటుంబీకులు వెళ్లి చూశారు. ఈ ఘటనపై కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి..



రామ్‌చరణ్ (ఫైల్)

దేవరుప్పుల : సెల్‌ఫోన్‌లో నిత్యం గేమ్స్ ఆడుతూ కళాశాలకు వెళ్లని ఓ ఇంటర్ విద్యార్థిని తండ్రి మందలించాడు. దీంతో గడ్డినివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని కడవెండికి చెందిన పసునూరి సంపత్ కుమారుడు రామ్‌చరణ్ (17)మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో నిత్యం సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్నాడు. కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండడంతో తండ్రి సంపత్ మందలించారు. దీంతో రామ్‌చరణ్ అక్టోబర్ 24వ తేదీన గడ్డి నివారణ మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు జనగామకు తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య


వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు దుఃఖ సాగరంలో మునిగాయి.



కాంతయ్య (ఫైల్)

కాశిబుగ్గ/: భూపాలపల్లి అర్బన్: అనారోగ్య సమస్యలతో రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డు సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ సురేందర్ కథనం ప్రకారం.. భూపాలపల్లి జవహర్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కుసుమ కాంతయ్య(74) కొంత కాలంగా భుజం నొప్పి, నరాల సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఆదివారం భూపాలపల్లి నుంచి బస్సులో వరంగల్‌కు వచ్చి రైల్వే గూడ్స్ షెడ్డు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అధికారులు.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుమారులు కృష్ణమోహన్, చంద్రశేఖర్‌కు అప్పగించామని జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ..




ఉపేందర్(ఫైల్)

కురవి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బలపాలలో జరిగింది. ఎస్సై గండ్రాతి సతీశ్ కథనం ప్రకారం.. కుటుంబ కలహాలతో గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్(42) భార్య కొంతకాలంగా కాపురానికి రావడం లేదు. దీనిపై మనస్తాపం చెందిన ఉపేందర్ శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ ఆదివారం తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

కాజీపేటలో యువకుడు..

కాజీపేట: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి కాజీపేటలో జరిగింది. మృతుడి స్నేహితుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సందీప్ సింగ్ (22) ఏడాది క్రితం కాజీపేటకు వలస వచ్చాడు. రైల్వే క్యాంటీన్‌లో వర్కర్‌గా పని చేస్తున్న సందీప్ సింగ్ సరైన పని దొరక్క మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కాజీపేట పోలీసులు ఘటనా స్థలికిచేరుకుని విచారణ చేపట్టారు.

గోపాలపురంలో మరో యువకుడు..



తిరుపతి మృతదేహం

చిట్యాల: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గోపాలపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి తిరుపతి(30)కి గణపురం మండలం అప్పయ్యపల్లికి చెందిన సరళతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. బావమరిది పెళ్లి కోసం తనకు దుస్తులకు డబ్బులు ఇవ్వలేదని మద్యం సేవించి వచ్చిన తిరుపతిశుక్రవారం రాత్రి భార్యతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో డబ్బులు తీసుకురావడానికి శనివారం ఉదయం సరళ తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. అదే రోజు గ్రామంలోని బంధువులు చనిపోతే జరిగిన తొమ్మిది రోజుల కార్యక్రమానికి వెళ్లి వచ్చిన తిరుపతి.. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు రాత్రి 11.30 గంటల సమయంలో భార్య, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1264009]

WANTED

■ మా అపార్ట్‌మెంట్‌లో, షాపింగ్ మాల్స్, ఆఫీస్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, స్వీపర్స్ అర్జెంటుగా స్త్రీ, పురుషులు కావలెను. సంప్ర॥ 9491710857, 7382106287. [W-1264007]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Q: 10th- డిగ్రీ, Sal: 20K-30K. మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [W-1239939]

■ మా ఆఫీస్‌లో పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Age: 18 to 45. Contact: 9491706517, 7382323126. [W-1264008]

■ హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్‌లలో పని చేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం నెలకు 16000/8గం. వసతి,క్యాంటీన్ కలదు.10thపాస్,ఎత్తు 5.6, వయస్సు 35సం.లోపు.Cell: 9346666721, 9346172927, 8919606707 [HA-98907]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA24000542]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.